ఉత్సవాలు పెద్దవి.. ఆలయాలు చిన్నవి

రోడ్డుకు 15 అడుగుల లోతు..

- పునర్నిర్మాణాలకు హెచ్‌ఎండీఏ అడ్డంకి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



ఐమాక్స్ ఎదురుగా ఉన్న కట్ట గంగమ్మ ఆలయం

ఖైరతాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌సాగర్ పరీవాహక ప్రాంతంలో హెచ్‌ఎండీఏ పరిధిలోని మూడు ఆలయాలకు దశాబ్దాల చరిత్ర ఉంది. ఈ ఆలయాల్లో ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. చిన్నపాటి వర్షం పడ్డా, ఈ ఆలయాల్లోని అమ్మవార్లు కనిపించరు. ఇక భారీ వర్షాలు పడితే ఆలయాలు, వాటి గోపురాలు సైతం నీట మునిగిపోతాయి. కుల సంఘాలు నిర్వహించుకునే ఈ ఆలయాలను అభివృద్ధి చేయాలని అటు ప్రభుత్వాలను, ఇటు హెచ్‌ఎండీఏను భక్తులు కోరుతున్నా వారు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రతియేటా బోనాలతోపాటు శ్రావణమాస ఉత్సవాలు, బతుకమ్మ వేడుకలు, దేవీ నవరాత్రుల పూజల కోసం వచ్చే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దశాబ్దాల చరిత్ర ఉన్న ఈ ఆలయాలను హెచ్‌ఎండీఏ అభివృద్ధి చేయాలని వందలాది మంది భక్తులు కోరుతున్నారు.

గాంధీనగర్ వాసుల కట్టగంగమ్మకు మోక్షం ఎప్పుడు?

ఖైరతాబాద్ ఐమాక్స్ ఎదురుగా ఉన్న కట్ట గంగమ్మ ఆలయానికి దాదాపు 40 సంవత్సరాల చరిత్ర ఉంది. అప్పట్లో హుస్సేన్‌సాగర్ ప్రస్తుత భారీ గణపతి ప్రాంగణమైన గ్రంథాలయం వెనక వరకు ఉండేది. ఇక్కడ రజకులు తమ జీవనోపాధి కోసం దుస్తులు ఉతికేవారు. తమ కుల వృత్తిని కాపాడాలంటూ వారు గంగమ్మ ఆలయాన్ని నిర్మించి పూజలు చేసేవారు. రానురాను సాగర్ కుచించుకుపోవడంతో రజకులు దుస్తులు ఉతకడం మానేసినా ఇక్కడి ఆలయాన్ని స్థానిక గాంధీనగర్ వాసులు కాపాడుతూ వచ్చారు. దివంగత సీఎల్‌పీ నేత పి.జనార్దన్‌రెడ్డి ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరినా హెచ్‌ఎండీఏ శిఖం భూమిలో నిర్మాణాలు చేపట్టరాదనే సాకుతో వారు పట్టించుకోలేదు. నిమ్న వర్గాలు అధికంగా ఉండే గాంధీనగర్ వాసులు ఈ ఆలయంలో నిత్య పూజలు చేస్తూ పలుసార్లు అభివృద్ధి చేసేందుకు ప్రయత్నించినా హెచ్‌ఎండీఏ అడ్డుకుంటూ వస్తోంది. ప్రస్తుతం ఈ ఆలయం సైతం భూమికి 15 అడుగుల దిగువన ఉంది. శిఖం స్థలంలో ఐమాక్స్ వంటి నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన హెచ్‌ఎండీఏ ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవడంపై దశాబ్దాలుగా గాంధీనగర్ వాసులు పోరాడుతూనే ఉన్నారు. చిన్న వర్షం వచ్చినా ఆలయం లోపలికి నీరు చేరుకొని అమ్మవారు కనిపించని దుస్థితి. ప్రతిరోజూ పూజలతోపాటు శ్రావణ మాసంలో భారీ ఎత్తున బోనాల ఉత్సవాలు నిర్వహిస్తూ అమ్మవారిని తమ ఇష్టదైవంగా మార్చుకున్నారు.

విన్నవిస్తున్నా.. పట్టించుకోవడం లేదు

హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్‌ఎండీఏ) అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందించాల్సి ఉండగా, ప్రజలు తమ కుల దైవాలుగా పూజలు చేస్తున్న ఆలయాలపై చిన్నచూపు చూస్తుండడంపై స్థానికంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మూడు ఆలయాల కమిటీలు ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వరుసగా వినతులు ఇస్తూనే ఉన్నా, పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విశ్వనగరంగా ఎదుగుతున్న నగరంలో ప్రముఖ పర్యాటక ప్రాంతాల నడుమ దశాబ్దాల చరిత్ర కలిగి భూమికి చాలా లోతుగా ఉన్న ఈ మూడు ఆలయాలను అదే స్థాయిలో అభివృద్ధి చేయడంపై అటు హెచ్‌ఎండీఏ, ఇటు ప్రజా ప్రతినిధులు చొరవ చూపాల్సిన అవసరమెంతైనా ఉన్నది.

గంగపుత్రుల ఆరాధ్య దైవం గంగమ్మ



హుస్సేన్ సాగర్ ఒడ్డున ఉన్న గంగమ్మ ఆలయం

55 సంవత్సరాల క్రితం హుస్సేన్‌సాగర్ ఒడ్డున చేపలు పడుతూ జీవనోపాధి పొందే గంగపుత్రులు కుల వృత్తికి ఎలాంటి ఆపద రాకుండా చూడాలంటూ గంగమ్మ ఆలయాన్ని(ప్రస్తుత పీవీ నర్సింహారావు విగ్రహం పక్కన) నిర్మించి పూజలు చేయడం ప్రారంభించారు. వందలాది మంది గంగపుత్రులు బోనాలు సమర్పించడంతో పాటు ప్రతీ శ్రావణమాసంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గంగపుత్రులు ఇక్కడ గంగతెప్పలను, బోనాలను సమర్పిస్తూ వైభవంగా గంగ తెప్పోత్సవాన్ని నిర్వహిస్తుంటారు. దీంతో పాటు ఆలయం సమీపంలోని హెచ్‌ఎండీఏ ఖాళీ మైదానంలో గంగపుత్రుల ఆత్మీయ సమ్మేళనం ప్రతియేటా నిర్వహిస్తారు. బతుకమ్మ సమయంలో ఇక్కడ భారీ ఉత్సవాలు జరిపి సాగర్‌లో వందలాది బతుకమ్మలను నిమజ్జనం చేస్తుంటారు. ఇంతటి ఖ్యాతిగాంచిన ఈ ఆలయం రోడ్డుకు 15 అడుగుల కిందకు ఉండడంతో చిన్న వర్షం వచ్చినా నీట మునుగుతోంది. చెరువుకు తీరాన ఉండడంతో హుస్సేన్‌సాగర్ నిండిన ప్రతిసారీ ఆలయమే కనిపించకుండా పోతుంది. ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర గంగపుత్ర సంఘాలతో పాటు గంగతెప్పోత్సవ కమిటీ పలుమార్లు మంత్రులకు, హెచ్‌ఎండీఏకు నివేదించినా స్పందన కనిపించడం లేదు.

లేక్‌వ్యూ పార్కులో యాదవుల ఆలయాలు



గాలిపోచమ్మ, కట్టమైసమ్మ ఆలయాలు

ఖైరతాబాద్ మారుతీనగర్ సమీపాన గతంలో యాదవులు తమ గేదెలను, దున్నలను మేతకు తీసుకొచ్చి తిరుగు పయనమయ్యే సమయంలో వాటికి హుస్సేన్‌సాగర్‌లో స్నానం చేయించి తీసుకెళ్లేవారు. తమ పశు సంపదకు ఎలాంటి విఘ్నాలు రాకుండా చూడాలని యాదవులు అప్పటి సాగర తీరం(ప్రస్తుత లేక్‌వ్యూ పార్కు) లోపల 50 సంవత్సరాల క్రితం గాలి పోచమ్మ, కట్ట మైసమ్మ ఆలయాలను నిర్మించారు. వాటికి నిత్యం పూజలు చేస్తూ రాగా, అవి యాదవుల ఆలయాలుగా మారాయి. ఇప్పటికీ చాలామంది యాదవులు ప్రతీ ఆదివారం ఇక్కడ పూజలు చేస్తుంటారు. ప్రతీ బోనాల పండగతోపాటు శ్రావణ మాసం, దేవీ నవరాత్రుల్లో ఇక్కడ పూజలు జరుగుతూనే ఉంటాయి. 10 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం రెండు సరస్సులు ఉన్న లేక్‌వ్యూ పార్కుగా అభివృద్ధి చేసి ఉదయం పూట వాకర్లను ఉచితంగా, అనంతరం సందర్శకులు టికెట్లు కొనుగోలు చేసి వెళ్లేలా చేశారు. గతంలో ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో ఉన్న పవర్ స్టేషన్‌కు రైళ్ల ద్వారా బొగ్గును సరఫరా చేస్తూ విద్యుదుత్పత్తికి వాడే బొగ్గును వాడిన ఈ ప్రదేశం ప్రస్తుతం పచ్చదనం పరిఢవిల్లే పార్కుగా మారినా, ఆలయాల్లో నిత్య ధూప, దీపాలు లేకపోవడంతో పార్కు ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడంలేదని ఇందులో పనిచేసే సిబ్బందే వాపోతున్నారు. స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆలయాల ను అభివృద్ధి చేయాలని కోరుతూ ప్రజాప్రతినిధులకు, హెచ్‌ఎండీఏకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం కనిపించ లేదు. దాదాపు 20 సంవత్సరాలుగా భూమికి 15 అడుగుల లోపల ఉన్న ఈ ఆలయాలను అభివృద్ధి చేయాలని యాదవులు ప్రయత్నిస్తున్నా హెచ్‌ఎండీఏ కనకరించడం లేదు.



మాట్లాడుతున్న ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే భారీ మెజారిటీ

- ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

బంజారాహిల్స్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్‌కు భారీ మెజారిటీ సాధ్యమవుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. నవోదయకాలనీలోని దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ వెంగళరావునగర్ డివిజన్ బూత్ స్థాయి కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గోపీనాథ్ ప్రజల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని గుర్తు చేశారు. అందుకే మూడుసార్లు విజయం సాధించారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కార్యకర్తలంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణతో పనిచేస్తూ బీఆర్‌ఎస్‌ను విజయతీరాలకు చేర్చాలన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని కోరారు. మాగంటి సతీమణి సునీత మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలకు ఎటువంటి అవసరం వచ్చినా తాను అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. మాగంటి ఆశయాలను కొనసాగించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు దేదీప్యరావు, రాజ్‌కుమార్ పటేల్ పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యే తలసాని ప్రొటోకాల్ ఉల్లంఘన’

బేగంపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తన ఇంట్లో సమావేశం పెట్టి పంపిణీ చేస్తున్నారని మహిళా కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. శుక్రవారం అమీర్‌పేట, సనత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయాల్లో జరిగిన సమావేశంలో నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఖమర హమీద, డివిజన్ మహిళా అధ్యక్షురాలు అశ్విని, అమీర్‌పేట మహిళా అధ్యక్షురాలు రాజరాజేశ్వరి, నేతలు విజయలక్ష్మి, అనితాగుప్తా, సత్య, లక్ష్మి మాట్లాడారు. చెక్కుల పంపిణీ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరు చెప్పకుండా మాజీ సీఎం కేసీఆర్ పేరు చెప్పి లబ్ధిదారులను తలసాని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.



పూల్‌బాగ్‌లో స్థానికులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు(ఫైల్)

పూల్‌బాగ్‌లో అక్రమ మద్యం బంద్

- పోలీసుల కౌన్సెలింగ్, హెచ్చరికతో మార్పు

ఖైరతాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొద్దికాలం క్రితం వరకు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు మద్యం దొరికే ప్రాంతంగా పూల్‌బాగ్ పేరుగాంచింది. ఉదయం పండ్లు, కూరగాయల దుకాణాలు నిర్వహించే పార్థీలు ఆదాయం చాలక రాత్రి సమయంలో మద్యం విక్రయాలు చేసేవారు. దీంతో అర్ధరాత్రిలో కూడా మద్యం కొనేందుకు వచ్చే మందుబాబులతో జాతర తరహా వాతావరణం ఉండేది. కానీ, సైఫాబాద్ పోలీసుల కృషితో ఈ ప్రాంతంలో గత 10 రోజుల నుంచి గణనీయమైన మార్పు వచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సైఫాబాద్ పోలీసులు బెల్ట్‌షాపుల నిర్వాహకులకు పలు దఫాలుగా కౌన్సెలింగ్ ఇవ్వడంతోపాటు పీడీ యాక్ట్‌లు నమోదు చేస్తామని కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ఈ దెబ్బకు చాలామంది మద్యం అమ్మకాలపై వెనకడుగు వేయడం ప్రారంభించారు. అంతేగాకుండా ఈ ప్రాంతంలో నిరంతరం నిఘా పెట్టేందుకు 10 కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్న సైఫాబాద్ పోలీసులు ముందుగా 5 కెమెరాలను బిగించారు. కాగా, పేద వర్గాలకు చెందిన పార్థీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే రుణాలు ఇస్తే మద్యం విక్రయాలను పూర్తిగా నిర్మూలించవచ్చని పలువురు సూచిస్తున్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని మోసం

యూసుఫ్‌గూడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పలుకుబడితో డబుల్ బెడ్‌రూమ్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్‌కు చెందిన ఎం.శ్రీనివాసరావుకు స్నేహితుడు కట్ట రామసురేష్. ఈయనకు పరిచయస్తుడు తోట రవి శ్రీనివాసరావుకు డబుల్ బెడ్‌రూమ్ ఇప్పిస్తానని చెప్పి 2024లో రూ.80 వేలు తీసుకున్నాడు. కొంతకాలం తర్వాత కటూరి నారాయణమ్మ, వెంకట్, బి.కుమార్ బాబును జీహెచ్‌ఎంసీ అధికారులుగా పరిచయం చేసి తెల్ల పేపర్‌పై సంతకాలు పెట్టి ప్రొసీడింగ్ పత్రాలుగా సీజ్ చేసి శ్రీనివాసరావుకు అందజేశారు. వాటిని శ్రీనివాసరావు ఆన్‌లైన్‌లో పరిశీలించగా, ఆ పత్రాలన్నీ నకిలీవని తేలింది. దీంతో శుక్రవారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనం మాయం

యూసుఫ్‌గూడ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్ ముందు నిలిపిన ద్విచక్ర వాహనం మాయమైంది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిగూడకు చెం దిన జి.ఏడుకొండలు ఈనెల 14న అపార్ట్‌మెంట్ ఎదుట యమహా బైక్(టీఎస్ 09ఈఆర్ 7502)ను నిలిపి సొంతూరు నంద్యాలకు వెళ్లాడు. తిరిగి 17న హైదరాబాద్‌కు వచ్చాడు. బైక్ కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

పంజాగుట్ట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. పంజాగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 3న ఎల్లారెడ్డిగూడ పోచమ్మ ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తి(40) స్పృహ తప్పి పడి ఉన్నాడని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. చికిత్స నిమిత్తం అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి అతడి సంబంధీకుల గురించి పోలీసులు ఆరా తీస్తూనే ఉన్నారు. పరిస్థితి విషమించడంతో ఈనెల 17న రాత్రి పది గంటల ప్రాంతంలో అతడు మృతిచెందాడు. ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు గాంధీ ఆస్పత్రికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని అదే ఆస్పత్రిలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పంజాగుట్ట పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ శోభన్ విజ్ఞప్తి చేశారు.

బల్కంపేట ఎల్లమ్మకు గాజులతో అలంకారం



గాజులతో అలంకృతురాలైన బల్కంపేట ఎల్లమ్మ మూల విరాట్

అమీర్‌పేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం పురస్కరించుకుని బల్కంపేట ఎల్లమ్మ తల్లి రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. శుక్రవారం అమ్మవారి మూలవిరాట్‌ను, గర్భగుడిని గాజులతో అందంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆదివారం ఆషాఢ బోనాల ఉత్సవాలు జరగనుండడంతో రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ఆలయాన్ని తీర్చిదిద్దుతున్నారు.

కబరస్థాన్‌కు స్థలం కేటాయించాలి

బోరబండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ హెచ్ఎఫ్‌నగర్, సంజయ్ నగర్ మధ్యన ఉన్న ముస్లింల కబరస్థాన్‌లో శుక్రవారం ప్రార్థనల అనంతరం వందలాది ముస్లింలు నిరసన తెలిపారు. కబరస్థాన్‌కు అదనపు స్థలం కేటాయించాలని జూబ్లీహిల్స్ యూనిటీ యూత్ అసోసియేషన్ తరఫున ప్రభుత్వాన్ని కోరారు. రహ్మత్ నగర్ మరుభూమిలో చోటు కరువై ఒకే గుంతలో ఇద్దరు ముగ్గురిని ఖననం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, వక్ఫ్ బోర్డు అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

లయన్స్ అదనపు కార్యదర్శిగా ఉమాశంకర్‌రెడ్డి



ఉమాశంకర్‌రెడ్డి

పంజాగుట్ట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ 320ఏ అదనపు డిస్ట్రిక్ట్ క్యాబినెట్ కార్యదర్శిగా అమీర్‌పేటకు చెందిన లయన్ పి.ఉమాశంకర్‌రెడ్డి ఎంపికయ్యారు. పది సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అభయ బంజారా క్లబ్ ద్వారా ఆయన పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను లయన్స్ క్లబ్ సభ్యులు అభినందించారు.



భక్తప్రహ్లాద నాటకంలోని ఓ సన్నివేశం

ఆకట్టుకున్న భక్తప్రహ్లాద నాటకం

అమీర్‌పేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సురభి 140వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం సౌజన్యం, మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, కమ్మ సంఘం హైదరాబాద్ సహకారంతో భానోదయ నాట్యమండలి(సురభి) కళాకారులు మూడు రోజులపాటు ప్రదర్శిస్తున్న నాటకాలు శుక్రవారం అమీర్‌పేట కమ్మ సంఘం మెయిన్ హాల్‌లో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రదర్శించిన భక్తప్రహ్లాద నాటకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఉగ్ర నరసింహ అవతారంలో హిరణ్యకశిపుడిని వధించే సన్నివేశం అద్భుతం రక్తి కట్టించింది. నేటి సాయంత్రం 6 గంటలకు లవకుశ నాటకం, 20వ తేదీన మాయాబజార్ నాటకాలు ప్రదర్శింపబడుతాయని సంఘం ప్రధాన కార్యదర్శి మేకా రామకృష్ణ తెలిపారు. అంతరించిపోతున్న నాటక రంగాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రతీ సంవత్సరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



బోరబండ బలహీనవర్గాల కాలనీలోని గుంతలో పడ్డ ఆటోను బయటకు తీస్తున్న యువకులు



పంజాగుట్ట శ్మశానవాటిక సమీపంలో క్యాచ్‌పీట్ల వద్ద చెత్తను తరలిస్తున్న సర్కిల్-18 డీసీ సమ్మయ్య, ఈఈ విజయ్ కుమార్, ట్రాఫిక్ పోలీసులు

భారీ వర్షం.. ఆగమాగం

- మైత్రీవనంలో కొట్టుకుపోయిన వాహనాలు
- వరదనీటిని దాటేందుకు విద్యార్థుల పాట్లు.. ట్రాఫిక్‌జామ్



కృష్ణానగర్‌లో కుమారుడిని రోడ్డు దాటిస్తున్న తండ్రి

ఖైరతాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షంతో శుక్రవారం నగర వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్లపై పలుచోట్ల వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో హైడ్రా అప్రమత్తమైంది. తొలిసారిగా హైడ్రా ఆధ్వర్యంలో నీరు నిలిచే చోట్ల ఏర్పాటైన క్యాచ్‌పీట్ల వద్ద హైడ్రా సిబ్బంది కనిపించారు. మైత్రీవనం వద్ద భారీ వరదనీరు పోటెత్తడంతో ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోయాయి. శ్రీనివాసనగర్ వెస్ట్, మైత్రీవనం తదితర ప్రాంతాల్లో నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బేగంపేట మయూరి మార్గ్‌లో వర్షపునీరు భారీగా నిలిచిపోయి ఇళ్లలోకి నీరు చేరడంతో ఇంట్లోని వస్తువులు నీట మునిగాయి. కృష్ణానగర్‌లో భారీగా వరదనీరు పోటెత్తడంతో వాహనాలు నీటమునిగి నిలిచిపోయాయి. దీంతో వాహనదారుల కష్టాలు వర్ణనాతీతం. లక్డీకాపూల్, ఖైరతాబాద్, పంజాగుట్ట, అమీర్‌పేట, మైత్రీవనం, ఎస్ఆర్ నగర్, మాసాబ్‌ట్యాంక్, సైఫాబాద్, బేగంపేట, గ్రీన్‌లాండ్స్, హైటెక్ సిటీ, తీగల వంతెన, తదితర ప్రాంతాల్లో వర్షం కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. చాలా సమయం ట్రాఫిక్‌లో చిక్కుకొని వాహనదారులు, ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది నీరు నిలిచే ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలను ముమ్మరం చేశారు.



బేగంపేట మయూరిమార్గ్‌లో భారీగా నిలిచిన వర్షపు నీరు



కృష్ణానగర్ డి-బ్లాక్‌లో వరద తాకిడికి ద్విచక్ర వాహనాల పరిస్థితి



ఓం కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫలహారం బండిని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్ యాదవ్, ఆకాష్ తదితరులు



ఎర్రగడ్డలో ఫలహారం బండిని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మాగంటి వజ్రనాథ్



బోనాల వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్ తదితరులు

ఫలహారం బండ్ల ఊరేగింపు

ఎర్రగడ్డ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలో జరిగిన బోనాల ఉత్సవాల్లో ఫలహారం బండ్ల ఊరేగింపు ప్రత్యేకంగా నిలిచింది. గురువారం అమ్మవారికి బోనాలు సమర్పించగా, శుక్రవారం డప్పు వాయిద్యాలు, డీజే చప్పుళ్ల మధ్య ఫలహారం బండ్ల ఊరేగింపు వైభవంగా జరిగింది. కార్యక్రమాలలో పలు అసోసియేషన్ల నిర్వాహకులు, స్థానిక నాయకులు ఎన్ఎస్‌కే రాజు, రాజాసింగ్, రమేష్ నాయక్, యాకమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపీ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేవీ వేదం, వైష్ణవి రెసిడెన్సీ, కృష్ణా నగర్ సి-బ్లాక్, జూబ్లీహిల్స్ పీఈఐ అండర్ గ్రౌండ్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ పత్రికానగర్, కుమ్మరిబస్తీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లోనూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు. అలాగే, గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ చరణ్ సింగ్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేవీ ఎర్రగడ్డ, శంకర్ లాల్ నగర్, ప్రేమ్ నగర్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ పేర్కొన్నారు.

మునిగిన ప్యాట్నీనగర్

సికింద్రాబాద్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లోని రసూల్‌పురా చౌరస్తా- ఆనంద్ టాకీస్ మధ్యనున్న ప్యాట్నీ నగర్‌ను శుక్రవారం కురిసిన భారీ వర్షం ముంచేసింది. సాయంత్రం ఏకధాటిగా కురిసిన వర్షానికి తోడు పక్క నుంచే వెళుతున్న నాలా పొంగి, వరద నీరు కాలనీని అతలాకుతలం చేసింది. ఐదు అడుగులకు మించి వర్షపునీరు చేరి, చెరువును తలపించింది. ఇళ్లలో నివసిస్తున్న వారు పైఅంతస్తుల్లోకి వెళ్లి ఊపిరి పీల్చుకోగా, ఆఫీసులు, షోరూమ్‌లు తదితర వ్యాపార సంస్థల్లోని సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమని గడిపారు. పోలీసులు, హైడ్రా అధికారులు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. ఆఫీసులు, వ్యాపార సంస్థల్లో పని చేసే సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకురావడంపై తర్జన భర్జనలు పడ్డారు. అనంతరం హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా రంగంలోకి దిగారు. ట్యాంక్‌బండ్ నుంచి ప్రత్యేక పడవలను తెప్పించి, వాటి సహాయంతో దాదాపు 100 మందిని బయటకు తెప్పించి, సురక్షితంగా వారు ఇళ్లకు చేరుకునేలా చేశారు.

భారీ వర్షాలు కురిస్తే ముంపు ఖాయం..


ప్యాట్నీ నగర్‌లో పరిస్థితిని సమీక్షిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్యాట్నీ నగర్‌లో 20 వరకు భవనాలు ఉన్నాయి. వీటిలో ఐదు భవనాల్లో నివాసాలు కొనసాగుతుండగా, మిగతా భవనాల్లో దుకాణాలు, కొరియర్ సంస్థ, షోరూమ్‌లు నడుస్తున్నాయి. ఈ సంస్థల్లో 150 మంది వరకు సిబ్బంది పని చేస్తున్నారు. హస్మత్‌పేట్ నాలా, మారేడుపల్లి మహేంద్రాహిల్స్ నుంచి ప్రారంభమయ్యే పికెట్ నాలాలు ప్యాట్నీనగర్ వద్ద కలిసిపోయి, ప్యాట్నీ కంపౌండ్ నుంచి మినిస్టర్ రోడ్డులోని హుస్సేన్‌సాగర్ నాలాలో కలుస్తాయి. అక్రమ కట్టడాల కారణంగా ఈ నాలా కుచించుకుపోయి చిన్నదిగా మారడం, ప్యాట్నీనగర్‌ను ఆనుకుని ప్రధాన నాలా ఉండడం, హస్మత్‌పేట్ నాలా, పికెట్ నాలా.. రెండు నాలాలు కలిసే ప్రాంతం కావడంతో.. భారీ వర్షాలకు నాలా పొంగితే.. వరద నీరు ఈ ఏరియాను ముంచెత్తుతోంది. కొద్ది సంవత్సరాల క్రితం ఈ ఏరియాలో నాలాను విస్తరించారు. దాంతో ముంపు సమస్య చాలా వరకు తగ్గింది. భారీ వర్షాలకు నాలాకు ఇరువైపులా ఉండే పైగా కాలనీ, రసూల్‌పురా తదితర ఏరియాలు ముంపుకు గురవుతున్నాయని, నాలాను మరింత విస్తరించడంతో పాటు ఆక్రమణలను తొలగించి, వరద నీరు సాఫీగా ముందుకు ప్రవహించేలా చూడాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు పలువురు మొరపెట్టుకున్నారు. స్పందించిన రంగనాథ్ ప్యాట్నీ నగర్ వద్ద నాలాపై ఉన్న కొన్ని భవనాలను నేలమట్టం చేశారు. అనంతరం నాలా ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం భారీ వర్షం కురవడంతో నాలా పొంగి, ప్యాట్నీ నగర్‌ను ముంచెత్తింది. ఫలితంగా భవనాల గ్రౌండ్ ఫ్లోర్లలోకి వర్షపునీరు చేరింది. ద్విచక్ర వాహనాలు, కార్లు వరదనీటిలో చిక్కుకుపోయాయి. ఇళ్లలో నివసించే ప్రజలు, వ్యాపార సంస్థల్లో పని చేసే సిబ్బంది తీవ్ర ఆందోళనలకు గురయ్యారు. హైడ్రా, పోలీసు, కంటోన్మెంట్ బోర్డు తదితర విభాగాల అధికారులు రంగ ప్రవేశం చేసి, వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు.


బాలంరాయి-తాడ్‌బందు ప్రధాన రహదారిలో వర్షపునీరు


మహ్మద్‌గూడ ప్రధానరహదారిపై నిలిచిన వర్షపునీరు


వర్షంలోనే ఇంటికి వెళుతున్న విద్యార్థులు

దంచికొట్టిన వాన


నెల్లూరు పోచమ్మ రహదారిలో బైకును తోసుకెళ్తున్న ఓ వ్యక్తి

- చెరువులను తలపించిన రహదారులు
- స్తంభించిన ట్రాఫిక్
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు

సికింద్రాబాద్/ బోయినపల్లి/ బౌద్ధనగర్/ అడ్డగుట్ట/ తిరుమలగిరి/ తార్నాక, జూలై 18 (ఆంధ్రజ్యోతి): లష్కర్‌లో వర్షం దంచి కొట్టింది. భారీ వర్షానికి జన జీవనం అతలాకుతలమైంది. సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండి, బౌద్ధనగర్, తిరుమలగిరి, అడ్డగుట్ట, బోయినపల్లి, తార్నాకలో రహదారులన్నీ జలమయమయ్యాయి. శుక్రవారం సాయంత్రం సరిగ్గా పాఠశాలలు మూసివేసే సమయానికి భారీ వర్షం ప్రారంభం కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. బేగంపేట్- హరిహర కళాభవన్, జూబ్లీ బస్‌స్టేషన్- తిరుమలగిరి, సంగీత్- తార్నాక రహదారిలో ట్రాఫిక్ స్తంభించింది. జడివాన కారణంగా ప్యాట్నీ కంపౌండ్, విమాన్‌నగర్, రసూల్‌పురా, బోయినపల్లి మర్రిరామ్‌రెడ్డి కాలనీ, హర్షవర్ధన్ కాలనీ, సీతారాంపూర్, బాలంరాయి-తాడ్‌బంద్ ప్రధాన రహదారిలో మోకాలి లోతు వర్షపునీరు చేరింది. ప్యాట్నీ కంపౌండ్‌లో నాలుగు అడుగుల మేరకు వర్షపు నీరు నిలిచిపోవడంతో గ్రౌండ్ ఫ్లోర్లలో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎల్.నారాయణనగర్, సీతాఫల్‌మండి డివిజన్‌లోని నాలా పరివాహక ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపునీరు చేరడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. లాలాపేటలోని నాల పరివాహక ప్రాంతాలైన సత్యానగర్, ఇందిరానగర్, చంద్రబాబునగర్, సిరిపురి కాలనీ, వినోభానగర్ ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. అడ్డగుట్టలో వర్షం నీరు ప్రవహించడంతో ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల గోడ కూలింది. తుకారాంగేట్ సాయినగర్‌లోని నల్ల పోచమ్మ ఆలయం నాలాపై ఉన్న బండరాళ్లు వర్షానికి లేచి బయటికి రావడంతో స్థానికులు భయాందోళన చెందారు. అలాగే, తిరుమలగిరిలోని ఆర్టీఓ కార్యాలయంలో రేకులు పాడయిపోవడంతో వర్షం నీరు పౌరులపై పడింది. అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారుల మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు తమ వాహనాలను రోడ్ల పక్కనే చాలా సేపు ఆపి, వర్షం తగ్గిన తర్వాత తిరుగు పయనమయ్యారు. వర్షాలు కురిసినప్పుడల్లా ఎగువ ప్రాంతాల నుంచే వచ్చే వరదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, జీహెచ్‌ఎంసీ అధికారులు ఇండ్లలోకి మురుగు నీరు రాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.


ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్ బస్తీలో కూలిన పాఠశాల ప్రహరీ


తిరుమలగిరి ఆర్టీఏ కార్యాలయం లో నీరు


వర్షం నీటిలో ఆగిపోయిన స్కూల్ వ్యాను, స్కూల్ ఆటో రిక్షా


అడ్డగుట్ట: వెంకట్‌నగర్‌లో వర్షానికి బస్తీలోకి చేరిన నీరు

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి



తార్నాక: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలతో పాటు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ, భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని జీహెచ్‌ఎంసీ ఎమర్జెన్సీ మాన్‌సూన్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కంట్రోల్ రూమ్ ద్వారా 24 గంటలు సేవలందించాలని కోరారు. ప్రజలు విద్యుత్ స్తంభాలు, నీటి ప్రవాహ ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు.

అడ్డగుట్ట అభివృద్ధి ఘనత బీఆర్‌ఎస్‌దే

- సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

అడ్డగుట్ట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్టను అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్ పార్టీకే దక్కుతుందని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. అడ్డగుట్టలో రూ.3.60 కోట్లతో నిర్మిస్తున్న మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ, అడ్డగుట్టలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని చెప్పారు. అడ్డగుట్ట కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు రూ.2.25కోట్ల నిధులను గతంలోనే మంజూరు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం అదనంగా రూ.1.15 కోట్ల నిధులను కేటాయించినట్టు తెలిపారు. అడ్డగుట్టలో 506 గ్రూపులకు రుణాలను మంజూరు చేయించానని ఎమ్మెల్యే చెప్పారు. తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.25 లక్షలు మంజూరు చేసి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, రూ.13.05 లక్షలతో మినీ గాంధీ ఆస్పత్రి నిర్మించుకున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు పద్మలత, ఆశీష్‌తివారి, సలీం, బీఆర్‌ఎస్ యువ నేత రామేశ్వర్‌గౌడ్, మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు

ముగిసిన మహాకాళి బోనాల వేడుకలు

తిరుమలగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి లాల్‌బజార్‌లోని మహాకాళి ఆలయంలో రెండు రోజులు నిర్వహించిన బోనాల వేడుకలు గురువారం రాత్రి కనుల పండువగా ముగిశాయి. డప్పుల దరువులు, పోతరాజుల వీరంగం, ఫలహారం బండ్ల ఊరేగింపుతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భవిష్యవాణిని వినిపించడానికి ఉపయోగించే పచ్చికుండను ఆనవాయితీ ప్రకారం తిరుమలగిరి విలేజ్ నుంచి ఎదుర్కొని వచ్చారు. అనంతరం భవిష్యవాణి కార్యక్రమం నిర్వహించారు. యాప్రాల్‌కు చెందిన శ్రీకాంత్ పచ్చికుండపై నిలబడి అమ్మవారిని ఆవహించుకుని భవిష్యవాణి వినిపించారు. అమ్మవారి ఆలయాన్ని విస్తరించాలని, శ్రావణ మాసంలో మహిళలు పసుపు నీళ్ల సాక సమర్పించాలన్నారు. అందరినీ చల్లగా చూస్తానని, వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని భవిష్యవాణి వినిపించారు. తిరుమలగిరి వీకర్ సెక్షన్‌లో నల్లపోచమ్మ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫలహారం బండిని ఊరేగింపుగా లాల్‌బజార్ మహాకాళి ఆలయం వరకు తీసుకువచ్చారు.

సమస్యల పరిష్కారానికే ‘బస్తీబాట’

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

తిరుమలగిరి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ తెలిపారు. అయోధ్యనగర్ బస్తీలో ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీలోని ప్రతిఇంటికి స్వయంగా వెళ్లి ప్రజల సమస్యలను ఎమ్మెల్యే తెలుసుకున్నారు. యూజీడీ, అంతర్గత రహదారులు, ఎలక్ట్రిసిటీ సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రభుత్వ భూమిలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించే విధంగా కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట కంటోన్మెంట్ బోర్డు మాజీ వైస్ ప్రెసిడెంట్ జయప్రకాష్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, సీఎం రామన్, ప్రేమ్‌కుమార్, రాజు, నరేష్, సుభాష్‌రెడ్డి, ముకేష్, శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.


బస్తీ వాసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

గాంధీ మెడికల్ కాలేజీలో బోనాల ఉత్సవాలు

అడ్డగుట్ట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గాంధీ మెడికల్ కాలేజీలో శుక్రవారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డా. శేఖర్, ఫోరెన్సిక్ విభాగాధిపతి కృపాల్ సింగ్, పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, భోగ ప్రకాశ్, భాస్కర్, భూషణ్, అంజనేయులు, టీఎన్‌జీఓ నాయకులు హరి కుమార్, ప్రభాకర్, సత్యనారాయణరెడ్డి, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

పేలిన ట్రాన్స్‌ఫార్మర్

బౌద్ధనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఓవర్‌లోడ్‌తో అజామాబాద్ విద్యుత్ కార్యాలయ పరిధిలోని వారాసిగూడ పుల్లయ్యబావి వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గురువారం రాత్రి పేలిపోయింది. వారాసిగూడ, న్యూఅశోక్‌నగర్, పుల్లయ్యబావి ప్రాంతాల్లో సుమారు పది గంటల పాటు కరెంటును అధికారులు నిలిపివేశారు. దీంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యానగర్ ఏఈ రోచితను వివరణ కోరగా.. పాత ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇంటి యజమాని ఒప్పుకోలేదని, ఈ ఘటనపై వారాసిగూడ పీఎస్‌లో కేసు నమోదైందని ఏఈ తెలిపారు.

శాకంబరీ దేవిగా బంగారు మైసమ్మ

బౌద్ధనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌కాలనీలోని బంగారు మైసమ్మ అమ్మవారు శుక్రవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ రకాల కూరగాయలతో బంగారు మైసమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకరించారు. ఆలయ చైర్మన్ పవన్‌కుమార్‌గౌడ్ దంపతులు, అధ్యక్షుడు బాలిరెడ్డి, కమిటీ సభ్యులు ధనశేఖర్, మహేశ్‌నాయుడు, శ్రీకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు బాలరాజుయాదవ్, శైలేందర్, భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


అమ్మవార్లకు వడిబియ్యం పోస్తున్న మహిళలు

భక్తులతో కిటకిట..

చిలకలగూడ కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం జరగనున్న బోనాల జాతరను పురస్కరించుకుని ముందస్తుగా మహిళా భక్తులు అమ్మవార్లకు వడిబియ్యం పోసి, బోనాలు, సాకను సమర్పించుకున్నారు.


దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్ సత్యనారాయణ

పరిసరాల శుభ్రత పాటించాలి

- జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్ సత్యనారాయణ

అడ్డగుట్ట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని జీహెచ్‌ఎంసీ సూపర్‌వైజర్ సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. అడ్డగుట్ట ప్రభుత్వ పాఠశాలలో దోమల నివారణపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. దోమల వల్ల వచ్చే వ్యాధులను ఆయన వివరించారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విద్యార్థులకు సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది శ్రీనివాస్, వసంత్‌కుమార్, శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సికింద్రాబాద్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్‌గా నవీన్

బౌద్ధనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్‌గా నవీన్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదం సంతోష్‌కుమార్, నవీన్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. అదే విధంగా కమిటీ ఉపాధ్యక్షులుగా వినోద్, దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శులుగా గుణాకర్, ఉప్పరి రఘు, ఆనంద్, జనార్ధన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అనిల్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా మహేశ్‌బాబులను నియమించినట్లు సంతోష్ తెలిపారు.


నవీన్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న సంతోష్‌కుమార్

బోనాల జాతరకు బోయినపల్లి సిద్ధం

- ఏడుగుడుల ఆలయానికి వందేళ్ల చరిత్ర
- ఈ నెల 20, 21 తేదీల్లో బోనాల నిర్వహణ
- ఈ సారి భక్తులు మరింత పెరిగే అవకాశం!

బోయినపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆషాఢమాసం బోనాల జాతరకు బోయినపల్లి సిద్ధమైంది. సికింద్రాబాద్ బోనాల తర్వాత నగర ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరుపుకునేది బోయినపల్లిలోనే. ఈ ప్రాంతంలోని ఏడుగుడుల దేవాలయం, బాపూజీనగర్ నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, దేవిపోచమ్మ, నెల్లూరు పోచమ్మ, కట్టమైసమ్మ ఆలయాల్లో ఈ బోనాల ఉత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. రెండు రోజులు జరగనున్న బోనాల జాతరకు ఆలయ నిర్వాహకులు, అధికారులు దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ బోనాలకు లక్షలాది మంది భక్తులు హాజరవుతారని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ సారి బోనాల జాతరకు గతేడాది కంటే అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు, పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.


బోనాలకు సిద్ధమైన నెల్లూరు పోచమ్మ ఆలయం


పోచమ్మ ముత్యాలమ్మ ఆలయం


బోయినపల్లిలోని ఏడు గుడుల ఆలయం

మేలుకొలుపు సేవతో ఉత్సవాలు ప్రారంభం..

బోయినపల్లిలో సుమారు 30కి పైగా ఆలయాలలో ఉన్నాయి. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో అమ్మవారికి మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించి ఆలయ నిర్వాహకులు తొలి బోనం సమర్పిస్తారు. దీంతో జాతర ప్రారంభమవుతుంది. నైవేద్యాలు, బోనాలతో మహిళలు వారివారి ప్రాంతాలలో ఉన్న అమ్మవారి ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటారు. బోనాల జాతరలో పోతరాజుల విన్యాసాలు, తొట్టెలు, ఫలహార బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

జాతరకు ఏర్పాట్లు పూర్తి



సికింద్రాబాద్ తర్వాత అతి పెద్ద జాతర జరిగేది బోయినపల్లి ఏడుగుడుల ఆలయంలోనే. వందేళ్ల క్రితం కొందరు భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం జరిగింది. అప్పటి నుంచి అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నాం. ప్రజలు పోలీసులకు, ఆలయ కమిటీ సభ్యులకు సహకరిస్తూ జాతరను ప్రశాంతంగా పండుగ వాతావరణంలో జరుపుకోవాలి.

- మర్రి అమరేందర్‌రెడ్డి, ఏడడుగుల ఆలయ చైర్మన్

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక. గణపతి పండుగ తరువాత కుల మతాలకతీతంగా బోనాల పండుగను నగర ప్రజలు జరుపుకుంటారు. నల్ల పోచమ్మ ఆలయం వద్ద భక్తులకు ప్రత్యేక క్యూ లైన్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. భక్తులు ఆలయ నిర్వాహకులకు సహకరిస్తూ అమ్మవారిని దర్శించుకోవాలి.

- ప్రేమ్ కుమార్‌ముదిరాజ్, నల్లపోచమ్మ ఆలయ కార్యనిర్వాహకుడు


ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని జేసీబీతో చదును చేయిస్తున్న కబ్జాదారులు

దివ్యాంగుల పాఠశాల స్థలం కబ్జాకు యత్నం

- ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

బోయినపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని తిరుమలగిరి మండలం న్యూబోయినపల్లి సంజీవయ్యనగర్ కాలనీలో దివ్యాంగుల పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని కొందరు కబ్జాకు యత్నించారు. కబ్జాకు యత్నించిన ముగ్గురు వ్యక్తులపై బోయినపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ తిరుపతి రాజు, ఎస్‌ఐ శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బోయినపల్లి సంజీవయ్య కాలనీ చిన్న తోకట్టలోని సర్వే నంబర్ 261లోని పురాతన ప్రభుత్వ పాఠశాలకు సంబంధించిన స్థలంలో బోయినపల్లికి చెందిన విజయ్‌కుమార్, తిరుపతి, మహేశ్‌లు జేసీబీ సహాయంతో ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని చదును చేసి ఆ స్థలంలో భవన నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. గురువారం ఈ ప్రాంతంలో విజయ్‌కుమార్ తన అనుచరులతో కలిసి ప్రభుత్వ పాఠశాల స్థలంలో జేసీబీ సహాయంతో చదును చేస్తూ పాఠశాలలో ఉన్న గదిలోని సామగ్రిని బయటకు పడేశాడు. గమనించిన స్థానికులు వెంటనే తిరుమలగిరి తహశీల్దార్ భిక్షపతికి సమాచారం అందించారు. స్పందించిన ఆయన రెవెన్యూ సిబ్బందిని అక్కడకు పంపించి జేసీబీని, విజయ్‌కుమార్, తిరుపతిలను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చి భూమి విషయంపై విచారించారు. విచారణ అనంతరం సదరు వ్యక్తులు ప్రభుత్వ పాఠశాలకు చెందిన భూమిని కబ్జా చేస్తున్నట్లు గుర్తించి తహసీల్దార్ బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మార్వో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రభుత్వ భూములను ఎవరూ ఆక్రమించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.